# సన్ ఇన్ లా......

సచిన్ టెండుల్కర్...వీరేంద్ర సెహ్వాగ్ స్టేడియాన్ని అదరగొట్టేస్తున్నారు. ముంబాయి వాంఖేడ్ స్టేడియంలో పరుగుల వరదలై పారుతున్నాయి. షోయబ్ అక్తర్... అఫ్రిది వాడూ వీడు అని లేదు అందరి బౌలింగు చిత్తు చిత్తు అయిపోతోంది. పాకిస్థాన్ కెప్టెన్ ఇంజమామ్ ముఖంలో నెత్తురు చుక్కలేదు. టీవీలు ఆ దృశ్యాన్ని మరీమరీ చూపిస్తున్నాయి.

చిన్నాపెద్దా, ఆడా మగా లేదు, అందరూ ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. క్రికెట్ అంటే కాసింత పిచ్చి ఉన్న ప్రతివారూ టీవీకి అతుక్కుపోతున్నారు. అందరిలాగే సవ్యసాచి కూడాను. మామూలుగా అయితే చిన్నపిల్లాడు అయిపోయి తాను కూడా కేరింతలు కొట్టేవాడే.

కానీ ఆ ఆనందక్షణాలు బుర్రకు పట్టడం లేదు. బంతి బౌండరీలు దాటుతున్నా సవ్యసాచి కడుపుమంట మండుతూనే ఉంది. అంతా చికాకుగా అయోమయంగా ఉంది.

'అంకుల్! ఇండియా నెగ్గుతుందంటారా....' రమణివైపు చూశాడు.

'ఎప్పుడొచ్చావ్ అమ్మాయ్!'

'సెహ్వాగ్ మొదటి సిక్సర్ కొట్టినప్పుడు'

'ఆ సిక్స్ కొట్టాడా... బ్యాటింగ్ ఆస్ట్రేలియా కదూ.. సెహ్వాగ్ కొట్టడమేంటి. కొంపదీసి ఆస్ట్రేలియా టీమ్‌లో చేరిపోయాడేంటి' తల

పట్టుకొంది రమణి, ఈ మధ్య సవ్యసాచి అంకుల్‌కి పరధ్యాన్నం మరీ ఎక్కువవుతోంది.. అయినా మరీ ఇంతగానా.

'సారీరా' చెప్పు ఓ మారు తల విదుల్చుకొని ఆమె ముఖంలోకి చూశాడు.

లేకబోతే ఏంటి అంకుల్..మ్యాచ్ జరిగేది పాకిస్థాన్‌తో మధ్యలో ఆస్ట్రేలియా ఎక్కణ్ణుంచి ఊడిపడిందా అని మౌనంగా నవ్వబోయాడు.. ఆ చిరునవ్వులో జీవంలేదు. కోటివేదనలు కన్పిస్తున్నాయి.

సవ్యసాచి మౌనభాష, మూగవేదన రమణికి తెలియందికాదు 'చెప్పు' రిమోట్‌తో టీవీని ఆఫ్ చేస్తూ అన్నాడు.

'మర్చిపోయారా' ఈ రోజు సన్‌డే, ఇంజక్షన్ చేసిపోదామని బ్యాగ్‌లోంచి మెడికల్ కిట్ తీస్తూ అంది.

'అవును! ఈ రోజు ఫ్రైడే " తనలో తాను అనుకోబోయి నాలుక కరచుకున్నాడు.

డిస్పోజబుల్ సిరంజితో ఇంజక్షన్ రెడీ చేసింది. ఏదో ఆలోచిస్తున్నాడు సవ్యసాచి.

'చెయ్యి అమ్మాయ్'!

'ఎప్పుడో అయిపోయింది అంకుల్!' కిట్ సర్దుకుంటూ అంది రమణి.

చూసుకున్నాడు. నొప్పికాదు కదా..కనీసం సూది గుచ్చుకున్నట్లు కూడా అన్పించ లేదు. అందుకే రమణి చేత ట్రీట్‌మెంట్ చేయించుకోడాన్కి ఇష్టపడతాడు సవ్యసాచి.

'స్వచ్ఛి ఏమైనా ఫోన్ చేసిందా!'

'లేదు'

'ఈ మధ్య ఏమైనా ఇక్కడకు రావడం....'

'ఏమో!'

'ఫోన్ చేస్తే దాన్ని అడిగానని చెప్పండి!'

'ఆమె నుండి కమ్యూనికేషన్ ఏమీలేదు. చేస్తే నీకే చెయ్యాలి.!'

' లేదంకుల్! మాకు మెడికల్ కేంప్స్ సీజన్ ఇది. అన్నీ టూర్లే టూర్లు. ఆస్పత్రి పట్టున ఉండటం లేదు.'

' ఈ సారి ఫోన్ చేస్తే ఈ అపసవ్యసాచి గురించి చెప్పు!'

'ఏమని'

'నీకు ఏం తోస్తే అది'

'మీ డాడీకి డయాబెటిస్ ఎక్కువవుతోందని'

'అదయితే పర్వాలేదు. అరవై దాటింతర్వాత రుగ్మతలు మనిషిలో అంతర్భాగమే కదా!

'ఇంకేదయినా అంటే.

'నీకు తెలియదని అనుకోకు నేను!' స్వరంతగ్గించి అన్నాడు. ఆమాటలు కొడుకు కోడలు వినిపోతారన్న ఆందోళన.. ఓ భయం తాలూకు ఫీలింగ్ చటుక్కున మెరిసి మాయ మయింది.

ఆ దృశ్యం హృదయ విదారకంగా అన్పించింది ఆమెకు. ఓ మానసధనుడి మొహంలో అటువంటి భావన కదలాడటం నిజంగా యాధృచ్ఛికమే!

బెటాకార్డ్ టాబ్లెట్ వేసుకుంటున్నా... అయినా కంట్రోల్ కావడం లేదు.

'రేపు క్లినిక్‌కి ఓసారి రండి! డాక్టరు కోర్సు రివైజ్ చేస్తారు రమణి వెళుతున్న వైపు చూస్తూండి పోయాడు. స్వచ్ఛిత క్లాస్‌మేట్ ఆమె. వచ్చిన ప్రతిసారీ కూతుర్ని తల్చుకోకుండా ఉండదు.

ఆఫ్ అయిఉన్న టీవీని ఆన్ చేయబోయాడు. అన్‌ప్లెజెంట్‌గా ఉండి మానుకున్నాడు.

ఆటలో ఎవరు నెగ్గితే తన కేమిటట. ఈ చరమాంకపు బ్రతుకు ఆటలో ప్రతినిమిషం ఓటమి పాలవుతూనే ఉన్నాడు తాను. ఉదయం ఇంట్లో శంకరం చేసిన యాగి గుర్తుకు వచ్చి బాధిస్తూనే ఉంది. తలచుకుంటున్న కొద్దీ ఉక్కిరి బిక్కిరవుతున్నాడు.

'ఏయ్! ముసలాడా డబ్బెల్లోకి వస్తున్నావ్! నీకు ఇంకా మందులూ ఇంజక్షన్లూ కావాలా! బ్రతికి ఎవరిని ఉద్ధరిద్దామని'.

'.............'

శంకరం అరుపులకి వెన్నులో వణుకు పుట్టుకొస్తోంది. తమాయించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ సవ్యసాచివల్ల కావడం లేదు. కొడుకుగా శంకరం నుండి ఆశించింది వేరు. కానీ అనుభవిస్తున్నది మరొకటి. ఇక శర్వాణి అయితే సరేసరి.

ఏరికోరి కోడలుగా తెచ్చుకున్నందుకు తగిన శాస్తే చేస్తోంది. అన్నీ ఉన్నాయను కున్నా ఏమీలేని బ్రతుకులో..తనమీద తనకు అసహ్యం కల్గుతోంది సవ్యసాచికి.

ఏడుస్తూ రోజూ ఆమె పడేసే నాలుగు ముద్దల అన్నం తనకేమీ వంటపట్టకపోగా బ్రతుకులోని వేదనల్ని ప్రోది చేస్తోంది.

సంపాదించాడు... కన్నవాడి కోసం కలలు కన్నాడు. స్వప్నసౌధాలు నిర్మించు

కున్నాడు. దానిలో శంకరానికి అపురూపమైన స్థానం కల్పించాడు. కూతుర్ని ఆడది అన్న నెపంతో కాలదన్నుకున్నాడు. అందుకు తగిన శాస్తినే అనుభవిస్తున్నాడు.

'మావగారూ! ఈ మధ్యనే కట్టిన నేతాజీ ఓల్డేజ్ హోం మిగతా వాటికన్నా బాగుందట. మీ అబ్బాయి అప్లికేషన్ తెచ్చారు. మాకు కూడ అద్దె ఇంటికి మారడం తప్పడంలేదు. శర్వాణి మాటలు క్రుంగదీస్తున్నాయి.

ఇదివరకయితే వాళ్లను నిలేసేవాడే. కానీ తన బ్రతుకే నిత్యం తనను నిలేసిపడేస్తోంది.

'నాన్నా' ఈ ఇల్లు మంచి సెంటర్‌లో ఉంది. అమ్మిపడేస్తే వాళ్ళు అపార్టుమెంట్ కడతారు. మనకి బాగానే ముట్టజెబుతారు. నాకూ ఉన్న లోన్స్ అన్నీ క్లియర్ అవుతాయి. దాంతో ఇల్లు అమ్మేయాలన్న నిర్ణయానికొచ్చాను. నా నిర్ణయానికి మీ కోడలు కూడా ఇష్టపడింది.

'అంటే నా ఇష్టం అవసరం లేదన్న మాట!'

'ముసలోడివి. మా అవసరాలు నీకేంటి తెలుస్తాయని'

'ఈ ఇల్లు నా కష్టార్జితం!'

అందుకే ఇప్పుడైనా చెబుతున్నాను. రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చి ఓ సంతకం పడేస్తే చాలు.

'తర్వాత....'

'నువ్వు చావకుండా బ్రతికి బట్టకట్టడానికి ఓల్డేజ్‌హోంలు తగిన ఏర్పాట్లు చేస్తున్నాయి.

'...............'

'అవునండి మావగారూ! ఈ ఇల్లు పీకేసి పందిరి లాంటి అపార్టుమెంటు కడుతున్నారు వాళ్లు. అమ్మేస్తే వచ్చిన డబ్బులతో అప్పులు తీర్చేసుకొని..........'

శర్వాణి మాటలు శరాఘాతంగా అన్పిస్తున్నాయి.

కొడుకు పున్నామనరకం నుండి తప్పిస్తాడని భ్రమపడ్డాడు. కానీ శంకరం తనకు ఇక్కడే నరకం చూపిస్తున్నాడు.

తన చేతుల మీదుగా గుండెల మీద పాకినప్పుడు అన్నం తినడానికి ఏడ్చిన కొడుకు...ఇప్పుడు ఈ వార్ధక్యంలో తనకు అన్నం పెట్టడానికి ఏడుస్తున్నాడు.

పరాయిపంచన బ్రతుకుతున్నానన్న ఊహ భారంగా అన్పిస్తూ నిలువునా దహించి వేస్తోంది.

'జీవితంలో ఏదయితే వద్దనుకుంటామో' ఆ వద్దనుకున్నదే జీవితానికి ఓ మలుపు నిస్తుంది.

భగవంతుడు మనకిచ్చింది దేనినీకూడా నో అనకూడదు అదే సవ్యసాచి థియరీ.

కానీ కూతురువిషయంలో తన ఉద్దేశాన్ని చాలావరకు సడలించుకున్నాడనే చెప్పాలి.

'ఇప్పుడది ముఖ్య మంటావా! నేనయితే 'నో' అనే చెప్తాను' అనాడు కడుపుతో ఉన్న భార్యకు స్కానింగ్ చేయించినప్పుడు అన్నమాటలు గుర్తుకు వచ్చి ఒకింత నిర్వేదనకు లోనయ్యాడు.

భర్తమాటలు అర్థం కాలేదు స్వర్ణకు. వింతగా చూసింది. మలి కాన్పులో అమ్మాయి అని తెలిసిన తరువాత సవ్యసాచిలోని మార్పులను గ్రహిస్తూనే ఉంది.

తనకు కూతురు పుట్టబోతోందన్న ఊహ ఆమెలో ఉత్సాహాన్ని పెంచుతూనే ఉంది. కానీ కట్టుకున్నవాడి నిరంకుశ ధోరణి స్వర్ణ మానసిక స్థితిని అతలా కుతలం చేస్తోంది.

'అబార్షన్‌కి డేట్ ఇవ్వమని డాక్టర్‌తో మాట్లాడాను. శంకరం ఒక్కడూ చాలు నాకు. ఈ ఆడసంత నా వల్ల కాదు. ఏదో చెప్పింది. బ్రతిమాలింది.

సవ్యసాచి ముందు ఆ వేడికోలు పనికి రాకుండా పోయింది.

'చూడు స్వర్ణా' ఆడపిల్లలతో వచ్చే సమస్యలు నీకు తెలియనివి కాదు. పెంచడం... చదువులు... పెళ్లిళ్లు... పురుడూ పుణ్యాలు.

స్వర్ణకు నోట మాటరావడంలేదు.

తన తల్లిదండ్రులతో చెప్పించి చూసింది. అత్తమామల్ని వేడుకొంది. ఎవరు చెప్పినా సవ్యసాచి మనసు మారలేదు.

చివరకు అతని పైశాచిక నైజానికి దిగిరాక తప్పలేదు.

'చూడు మిస్టర్! కడుపులో బేబీ గ్రోత్ బాగుంది. నెలలకు తగ్గట్టు ఆరోగ్యంగా పెరుగుతోంది. దట్ టు నీ భార్యకు మొదటి కాన్పులో బిడ్డ అడ్డం తిరగడంతో సిజేరియన్ చేయడం జరిగింది. మరలా ఇప్పుడు రిస్కు తీసుకుంటే మొదటికే తేడా రావచ్చు'.

ఆనాటి డాక్టర్ మాటలు అయోమయంలో పడేశాయి సవ్యసాచిని.

ఆడపిల్ల తనకు ససేమిరా అనుకున్నాడు. ఇప్పుడు ఆమెను డిస్టర్బ్ చేస్తే పిల్ల మాట ఎలా ఉన్నా తల్లికే ముప్పు వాటిల్లే ప్రమాదముంది.

డాక్టర్‌ని తనవారు ఇన్‌ఫ్లుయన్స్ చేస్తున్నారన్న అనుమానం సవ్యసాచిని పీడించింది.

'ఏందిరా! నీ పంతం నీదే గాని మా మాటలు వినేది లేదా!!' పనికిరాని పట్టుదలతో

ప్రాణాల మీదకు తెస్తావా?' తండ్రి నిలేసేసరికి ఒక మెట్టు దిగిరాక తప్పలేదు సవ్యసాచికి.

'అయితే పుట్టిన పిల్లతో నాకు సంబంధం ఏమీ లేదు' మొగుడు కేసి జుగుప్సగా చూసింది స్వర్ణ.

'సర్లేవోయ్! నారు పోసిన దేవుడు నీరు పోస్తాడు గాని నువ్వు గమ్మునుండు.

మొత్తానికి స్వచ్ఛిత సవ్యసాచి గారి అమ్మాయిగా గాక స్వర్ణమ్మ కూతురుగానే ప్రాచుర్యత పొందింది. ఆడపిల్ల అయిపుట్టినందుకు స్వచ్ఛిత చిన్నతనం నుండి ఆ ఇంట్లో అసమానతల్ని పరాభవాల్ని ఎదుర్కొంటూనే ఉంది.

పెద్ద చదువు చదువుకుంటాను నాన్నా అన్నప్పుడు, చదివింది చాల్లే అని వానాకాలం చదువు చెప్పించినప్పుడు, అన్నగారి ముందు తీసి పడేసిన ప్రతిసారి ఓ ఆడదానిగా అసహాయురాలిగానే మిగిపోయింది స్వచ్ఛిత.

తల్లితో చెప్పుకున్నా ఆమె చేతగాని తనం ఓ శాపంగా మారింది. ఆమె కాలం చేసిన తర్వాత అయితే మరీను... తన ప్రమేయం లేకుండా ఎవడితోనో మూడు ముళ్ళు వేయించుకొని కన్నవాళ్ళకు శాశ్వతంగా దూరం కాక తప్పలేదు.

కొడుకు కూతుళ్ల మధ్య సమతుల్యత పాటించాలన్న ఇంగిత జ్ఞానంలేక...ఆమెను వదిలించుకొనే ధోరణిలో...శంకరం మీదే పూర్తిగా ఆధారపడి..అవమానాలన్నిటినీ మౌనంగా భరిస్తూ....!

ఓ అర్థంలేని అవివేకపు తలంపులో పడి, అతలాకుతలమయి జీవితపు విభిన్న పార్శ్వాలలోని మెరుపులను ఆకళింపు చేసుకోలేక తెలియని ఆత్మవంచనతో స్వచ్ఛితను దూరం చేసుకుంటూనే ఉన్నాడు సవ్యసాచి.

కడుపులో పడ్డప్పుడే తీసేయాలనుకున్న ఓ కసాయి తండ్రిగా చరిత్రపుటల్లోకి ఎక్కకపోయినా సవ్యసాచి అంతరంగానికి తెలుసు కూతురు విషయంలో తాను ఎంతగా వివక్షత చూపించాడో!'

'డాడీ! నాకు మెడిసిన్ చదవాలనుంది. పెద్ద డాక్టర్‌నయి ఊరందరికీ సేవలు చేస్తా!' చందనపు బొమ్మలాంటి స్వచ్ఛిత స్వచ్ఛమైన అమాయకత్వంతో పలికిన మాటలు ఏ నాడూ సవ్యసాచి హృదయాన్ని కదిలించలేకపోయాయి.

'డాక్టర్ అయి రోగాలేమీ తగ్గించనక్కరలేదు. అన్నయ్యకి చదువు చెప్పించడాన్కి నాకు ఆకాశం కన్పిస్తోంది. ఇక నువ్వు డాక్టర్ అంటే నేను చుక్కల్ని ఏరుకోవాల్సిందే!'

'అమ్మాయి అడుగుతోంది. పరీక్షల్లో దానికి మార్కులు కూడా బ గానే వస్తున్నాయ్. అయినా దాని చదువుకి మనీకేం లోటు చెప్పండి!'

'అదే లోటు నాకు. దాన్ని డాక్టర్ని చేస్తే పెద్ద డాక్టర్ని మొగుడుగా తేవాలి. అప్పుడు లక్షలు గుమ్మరించాలి! అదే ఏదో డిగ్రీ అయిందనిపిస్తే వదిలించుకోవడం సులభం అవుతుంది'.

'వాణ్ణి బాగానే చదివిస్తున్నారుగా! ఇది చేసిన తప్పేమిటి?'

'ఆడదిగా పుట్టడం'

'అయినా పంచుకున్నది మన రక్తమేగా!'

'వదిలి పడేద్దామనుకున్నాను. పెరుగుతూ నా రక్తాన్ని పీల్చేస్తోంది.'

తండ్రి మాటలు వేదనను, అసహ్యాన్ని కల్గజేస్తున్నాయి స్వచ్ఛితకు. తల్లి ముఖంలోని అనంత వేదన తాను ఆకళింపు చేసుకుంటూనే ఉంది.

❖ ❖ ❖

భార్య చనిపోయింతర్వాత సవ్యసాచిలో తెలియని ఆత్మన్యూనతాభావన. గతం తాలూకు చీకటి చిత్రాలు వెన్నంటుతూనే ఉన్నాయి. అసలు రాకపోకలు లేని కూతురు అల్లుడు... తనని పూర్తిగా పట్టించుకోవడం మానేసిన కొడుకు, కోడలు, దానికితోడు కొంత కాలంగా ఇల్లు అమ్మకానికి పెట్టి నిర్ధయగా బయటకు నెట్టేయడానికి ప్రయత్నిస్తున్న వైనం మరోవైపు కనీసం ఏ ఊరులో ఉందో కూడా తెలియని కూతురు కుటుంబం.

ఓ విధంగా పరిస్థితులకు సవ్యసాచి పూర్తిగా లొంగి పోయాడనే చెప్పొచ్చు. స్వచ్ఛిత గుర్తుకు వచ్చి ఎప్పుడైనా చూడాలనిపించినా..మగ అహంకారంతో తాను చేసిన గతం తాలూకు అన్యాయాలు గుర్తుకు వచ్చి ఖిన్నుణ్ణి చేస్తూనే ఉండేవి.

స్వచ్ఛితతో కలిసి చదువుకున్న రమణి ద్వారా అప్పుడప్పుడు సంగతులు తెలుస్తున్నాయంతే!

ఓ రూపం అంటూ సంతరించుకోని వికృతమైన వ్యక్తిత్వంతో..రక్తం పంచుకు పుట్టిందన్న స్పృహ కూడా లేకుండా కేవలం ఆడదిగా పుట్టిందన్న అనైతిక భావనతో స్వచ్ఛితను మొదటినుండీ దూరంగా నెట్టిపడేశాడు.

కన్న కూతురు...అల్లుడు...పిల్లలూ...కాపురం ఎలా ఉందో అన్న జ్ఞానం కూడా లేకుండా ఇన్నాళ్ళూ కాలం వెళ్ళ బుచ్చాడు. కానీ కొడుకు అని, ఏదో ఉద్ధరిస్తాడన్న సహేతుకం గాని ధ్యాసతో గ్రుడ్డిగా నమ్మినందుకు తగిన శాస్తిని అనుభవిస్తున్నాడు.

కష్టపడి సంపాదించుకున్న ఆస్థిపాస్తుల్ని కొడుకు హారతి కర్పూరంలా హరించి పడేస్తే ఏమీ చేయలేని అచేతన స్థితిలో తాను...

రమణి ద్వారా ఎప్పటికప్పుడు తండ్రి విషయాలు తెల్సుకుంటూనే ఉంది స్వచ్ఛిత.

కన్నవాడు కాదన్నా... కొన్ని వందల మైళ్ళ దూరంలో పరాయి రాష్ట్రంలో ఉన్నా సవ్యసాచిపట్ల ఓ బాధ్యతా బంధాన్ని పెనవేసుకుంటూనే ఉంది.

ఆరోజు తన మానసధనాన్ని అంతా మూటకట్టి అక్కడే వదిలేసి...అచేతనంగా వానప్రస్థం వైపు తప్పని పరిస్థితులలో అడుగులు వేస్తున్నాడు సవ్యసాచి.

ఇంట్లోంచి బయటకు వచ్చాడు.

'నాతో బెంగుళూరు వస్తున్నారు మీరు'.

సవ్యసాచికి నమ్మబుద్ధి కావడంలేదు. అది ఓకలలోని భాగంగా అన్పిస్తోంది. అటువైపు చూశాడు.

ఎదురుగా స్వచ్ఛిత..ఆమె భర్త. చిరునవ్వుతో రమణి పలకరిస్తోంది.

'ఉదయం శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చారు'.

ఆపద్బాంధవుల్లా అగుపిస్తున్నారు ఆక్షణంలో సవ్యసాచికి.

'కారు ఎక్కండి మావయ్యా! మా చిన్న బ్రతుకు గోడల మధ్యకు మీకు ఇదే మా సాదర స్వాగతం..'

ఎంత నొక్కిపెడుతున్నా పెదాలమధ్యనుండి దుఃఖం తన్నుకొస్తూనే ఉంది ఆయనకు.

కూతురు ముఖంలోకి చూశాడు. ఏ భావనా లేని స్వచ్ఛిత ముఖం నిశ్చలంగా ఉంది. తన మానసధనమంతా లోపల వదిలి వచ్చాడు. ఇప్పుడు ఎంతో ఊరటగా ఉంది.

హీ కేమ్ ఎలాంగ్ విత్ హెర్ హజ్బెండ్. మౌనంగా కారు బ్యాక్‌సీట్‌లో ఒదిగి పోయాడు.

కారు కదిలిపోయింది. కారులోని సవ్యసాచి ముందుకు సాగిపోయాడు.

ఆటో తీసుకొచ్చిన శంకరానికి విషయం అర్థం కాలేదు. అలా అచేతనంగా నిలబడి పోయాడు.

✿

**(జాగృతి వారపత్రిక కథల పోటీలో బహుమతి పొందిన కథ)**